
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 18 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	23.0

రూ.303కోట్ల

'రైతు భరోసా' జమ

- ఇప్పటివరకు 3,85,318 మంది రైతులకు లబ్ధి
- కొత్తగా పాస్‌పుస్తకం వచ్చిన వారికీ పైకం

7



నల్లగొండలో నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

లబ్ధిదారులే

నిర్మాణకర్తలు

- వారే నిర్మించుకు నేలా నూతన విధానం
- ఒక్కో ఇంటికి గరిష్ఠంగా రూ.5లక్షలు
- లబ్ధిదారులను త్వరగా ఎంపిక చేయాలని మంత్రి ఆదేశం
- ఆశావహుల ఎదురుచూపు

అసంపూర్తిగా నిలిచిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారు నేతృత్వంలో బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అందుకోసం తొలుత ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల వరకు గరిష్ఠంగా నిధులు కేటాయిస్తూ పెండింగ్ పనులను ఈ విధానంలో పూర్తిచేయాలని నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. బీఎల్‌సీ విధానం ప్రవేశపెట్టడం ద్వారా దాదాపు ఏడాదిన్నరకాలంగా పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. వీలైనంతవేగంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి ఆదేశించడంతో ఆ మేరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. స్థానికసంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో కీలకమైన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని నిర్ణయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అందుబాటులో 4,716 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 20వేల ఇళ్లను మంజూరు చేయగా, వాటిల్లో కేవలం 6,360 ఇళ్లు మాత్రమే నిర్మించారు. నిర్మించిన ఇళ్లల్లోనూ ఎన్నికల సమయానికి కేవలం 1,644 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించారు. మరో 4,716 ఇళ్లు అర్హులకు కేటాయించకపోవడం, వాటికోసం ఎన్నికల షెడ్యూల్ వచ్చేంతవరకు లబ్ధిదారుల ఎంపికపై అప్పటి ఎమ్మెల్యేలు సందిగ్ధంలో ఉండటంతో చివరికి ఇళ్లను ఎవ్వరికీ కేటాయించలేకపోయారు. ఆ ఇళ్లల్లో ప్రస్తుతం ఎవ్వరూ నివాసం ఉండకపోవడంతో క్రమంగా అవి శిథిలమవుతున్న పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,716 ఇళ్లు ప్రస్తుతం నిర్మించి అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా సూర్యాపేట నియోజకవర్గంలో 1,358 ఇళ్లు, నల్లగొండలో 710, మిర్యాలగూడలో 640, కోదాడలో 560, భువనగిరిలో 641, తుంగతుర్తి 211, నకిరేకల్‌లో 534తోపాటు ఆలేరులో ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు మరో 2వేలపైచిలుకు ఇళ్లఅసంపూర్తిగా ఉన్నాయి. 70శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన 4,716


- మిగతా 7వ పేజీలో...



నల్లగొండలో నిర్మాణం పూర్తయిన ఇళ్లు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రిజర్వేషన్లు, తదితర అంశాలపై చర్చించిన మంత్రివర్గం, ఏ క్షణమైనా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో సత్తా చాటి రానున్న రోజుల్లో మరింత పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



స్థానికంపై

బీజేపీ గురి

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధిష్ఠానం
- పల్లె, పట్టణం బాట పట్టాలని నేతలకు సూచన
- కేంద్ర ప్రభుత్వ పథకాలతో జనంలోకి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని అధిష్ఠానం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుకోసం తిప్పలు పడుతోంది. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోగా రాష్ట్రంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు అడుగులు వేస్తోంది. పార్టీ బలోపేతం కావాలంటే ప్రధానంగా క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలను తయారు చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీల్లో పాగా వేసేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకత్వం జిల్లా స్థాయి నేతలకు సూచించింది. జిల్లాల వారీగా కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా ఇన్‌చార్జీలను కూడా నియమించింది. ఈ నేతలంతా నిత్యం స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థుల ఎంపికతో పాటు అన్ని వ్యవహారాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే జిల్లా కార్యవర్గాలతో బీజేపీ ఇన్‌చార్జీలు సమావేశాలు నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని పదాధికారులంతా పల్లె, పట్టణం బాటపట్టాలని పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చింది. ఉమ్మడి జిల్లాల్లో రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని బలమున్న చోట పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

కేంద్రం పథకాలతో క్షేత్రస్థాయికి

కేంద్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద నిధులు విడుదల చేస్తోంది. వీటిపై క్షేత్రస్థాయిలో బీజేపీ

- మిగతా 7వ పేజీలో...

నిధులు మంజూరుచేసిన ప్రధానికి కృతజ్ఞతలు



కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద నిధులు విడుదల చేస్తోంది. యాదాద్రి జిల్లాకు కేంద్రప్రభుత్వం ఇటీవల రూ.8.47 కోట్లు విడుదల చేసింది. ఉపాధితో హామీతో పాటు కార్యక్రమాలకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో కేంద్రం అభివృద్ధికి బాటలు వేస్తోంది. నిధులు మంజూరుచేసిన ప్రధానమంత్రికి బీజేపీ, జిల్లా ప్రజల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ నేత, మాజీ ఎంపీ

ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి



నేరేడుగొమ్ము మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. దేవరకొండ మండలం మైనంపల్లి, కొర్రతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి సిమెంట్, ఇటుక, స్టీల్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని కొర్ర మౌనిక అనే లబ్ధిదారును అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణంలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బేస్‌మెంట్ బిల్లు వచ్చిందా అని అడగగా రూ.లక్ష తన అకౌంట్‌లో జమ అయ్యాయని మౌనిక కలెక్టర్‌కు తెలిపారు. ఇంటి నిర్మాణం వేగవంతంగా చేస్తున్నందున రెండో విడత బిల్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గతంలో ఎక్కడ ఉండేవారని కలెక్టర్ వారిని ప్రశ్నించగా గుడిసెలో ఉండేవారమని, గుడిసెను తొలగించి ఇందిరమ్మ ఇల్లును కట్టుకుంటున్నామని బాధితులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ ఉన్నారు.

పౌష్టికాహారం అందుతుందా..

నేరేడుగొమ్ము: మండలంలోని తిమ్మాపురం చెంచుకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడారు. పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. పక్కా భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీడీవో వాణి ఉన్నారు.

త్రిపురారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను అడిషనల్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, సిబ్బంది తదితరులున్నారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్‌కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెల వారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, రేషన్ బియ్యం అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నీ కూలంకుషంగా పరిశోధన చేయాలన్నారు. పోక్సో గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థ సేవలు అందిస్తూ సత్వర న్యాయం చేసేలా కృషిచేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ మౌనిక, ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రం ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుంది. బిక్షాటన, ఇతర పద్ధతుల ద్వారా ఉపాధి పొందుతున్న స్వయం ఉపాధితో వారు సమాజంలో గౌరవం పొందేలా కుట్టు శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం 35 మంది శిక్షణ శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ ద్వారా వారిలోని నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్‌లో మంచి స్థితిలో జీవించేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా శిక్షణ అనంతరం ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఆర్థికసాయం కూడా అందించనుంది. దీంతో వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఉపాధి పొందుతూ గౌరవప్రద జీవితాన్ని గడపనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)



సామాజిక గౌరవం దిశగా

సూర్యాపేటలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత కుట్టుశిక్షణ

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎన్నో అసమానతలు ఎదుర్కొంటున్నారు. సరైన జీవనోపాధి లేక ఇబ్బందికర జీవనం సాగిస్తున్నారు. సమాజంలో తమకంటూ ఓ గుర్తింపుకావాలని అందుకు జీవనోపాధి కల్పించాలని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్ర రాజధానిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అందుకు వారికి శిక్షణ సైతం ఇప్పించారు. అయితే ఇటీవల సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ నిర్వహించిన మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమావేశానికి ట్రాన్స్‌జెండర్లను ఆహ్వానించారు. తమకు ఏదైనా ఉపాధి కల్పించాలని, భిక్షాటన, ఇతర పనులు చేయడం ఇబ్బందిగా ఉందని, తమకంటూ సమజాంలో గౌరవం దక్కాలని కలెక్టర్‌కు వివరించారు. తాము కూడా గౌరవప్రదంగా జీవించాలని అందుకు తమకు ఏదైనా చేయాలని కలెక్టర్‌ను కోరారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను విన్న కలెక్టర్ వెంటనే జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు కుట్టు శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన నిధులను డీఎంఎఫ్‌టీ నుంచి మంజూరు చేస్తానని తెలిపారు. దీంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ సమీపంలో మహిళా సాధికారిత ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు కుట్టుశిక్షణలో మెళకువలు నేర్పిస్తున్నారు. ఈశిక్షణ రెండు నెలలపాటు కొనసాగనుంది.

35 మంది హాజరు..

సూర్యాపేటలో ట్రాన్స్‌జెండర్లకు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు ప్రస్తుతం 35 మంది హాజరవుతున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు

- మిగతా 6వ పేజీలో...

ఏటా విద్యా ఖర్చు..

రూ.150కోట్లు

తల్లిదండ్రుల జేబులు గుల్ల



6

సూర్యాపేటకు చెందిన రూప గృహిణి. ఆమె భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగి. నెల వేతనం రూ.18వేలు. వారికి బాబు, పాప ఉన్నారు. బాబు నాలుగో తరగతి చదువుతున్నాడు. పుస్తకాలకు రూ.5,700కాగా, ఫీజు రూ.40వేలు, యూనిఫాం, ఇతరత్రా కలిపి మరో రూ.20వేలు అవుతున్నాయి. ఆయన జీతం మాత్రం పెరగలేదు గానీ, గతేడాది మూడో తరగతి రూ.30వేలు ఉన్న ఫీజు ఇప్పుడు రూ.10 వేలు పెరిగింది. అప్పు చేయాల్సిన పరిస్థితి. మరో ఏడాదిలో పాపను స్కూల్‌లో చేర్పించాల్సి ఉండటంతో దాన్ని తల్చుకుని భయం వ్యక్తం చేస్తోంది.

-(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)

వల్లభరావు చెరువులో ఆక్రమణలు నిజమే

- నిర్ధారించిన నీటిపారుదలశాఖ అధికారులు
- హద్దులు దాటి నిర్మాణాలు చేపట్టారని స్పష్టీకరణ
- తక్షణ సర్వేకు తహసీల్దార్‌కు లేఖ



వల్లభరావు చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

నల్లగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువు (బతుకమ్మకుంట) లో ఆక్రమణలు జరిగినట్లు నీటిపారుదలశాఖ అధికారులు నిర్ధారించారు. వల్లభరావు చెరువు ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 16న 'వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించి శిఖం భూములను పరిశీలించాల్సిందిగా నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో నీటిపారుదలశాఖ డీఈఈ సతీష్ చంద్రతో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు దివ్య, మేఘన మంగళవారం సాయంత్రం వల్లభరావు చెరువు శిఖం భూములను పరిశీలించారు. చెరువు శిఖం ఆక్రమణకు గురైందని అధికారులు గుర్తించారు.

ఇదిలా ఉండగా ఆక్రమణదారులు గతంలో ఉన్న హద్దులు దాటి ప్రహరీ, గేటు నిర్మాణాలను చేశారు. చెరువు శిఖం భూములకు సంబంధించి గతంలో దిమ్మెలతో కూడిన హద్దులు ఉండేవి. ఆ దిమ్మెలను కూలగొట్టి ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఓ హద్దు రాయి మాత్రం ఆక్రమణదారుల కళ్లలో పడిందో లేదో గానీ వదిలేయడంతో దాని ఆధారంగా అధికారులు చెరువు శిఖం ఆక్రమణకుగురైనట్టు నిర్ధారణకు వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు భూమిని ఆక్రమించిన వారిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది ఆక్రమణదారులు కేసు కాకుండా చూసుకున్నారు. తిరిగి మళ్లీ ఆక్రమించి ప్రహరీ నిర్మించి హద్దులు కనపడకుండా చేసి కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేసే యత్నంలో ఉన్నారు.

తప్పుదోవ పట్టించిన రెవెన్యూశాఖ

వల్లభరావు చెరువు ఆక్రమణకు గురైనా రెవెన్యూ శాఖ మాత్రం తప్పుదోవ పట్టించేలా వ్యవహరించింది. సర్వే చేయకుండానే చేసినట్టు రికార్డు తయారు చేయడంతో పాటు కాగితాలకే పరిమితం చేసి ఫీల్డ్ సర్వేను చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 86 ఎకరాల చెరువు శిఖం భూమిని 20 నిమిషాల్లో ఎలా సర్వే చేస్తారని పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు నీటిపారుదలశాఖకు ఎలాంటి ఆక్రమణలు జరగలేదని చెప్పడంతోపాటు ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు సైతం తప్పుడు నివేదిక అందించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. సర్వే చేపట్టే బాధ్యత రెవెన్యూశాఖకు ఉండటంతో ఆక్రమణదారులతో కుమ్మక్కయినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా, చెరువు ఆక్రమణకుగురైనట్టు నీటిపారుదల శాఖ గుర్తించి దీనిపై తహసీల్దార్ హరిబాబుకు లేఖ రాయాలని నిర్ణయించారు.

ఇదిలా ఉండగా, తప్పుడు సర్వే నిర్వహించిన సర్వేయర్‌ను తొలగించి సీనియర్ సర్వేయర్‌ను, ఇతర మండలాల సర్వేయర్‌తో సర్వే చేయాలని స్థానికులు కోరుతున్నారు. తహసీల్దార్ హరిబాబు వల్లభరావు చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు స్వయంగా చెప్పగా, నీటిపారుదల శాఖ అధికారులు చెరువు ఆక్రమణకు గురైనట్లు ధ్రువీకరించినందున తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై నీటిపారుదలశాఖ అధికారులను వివరణ కోరగా, ఆక్రమణలకు పాల్పడిన వారిపై వారం రోజుల్లోపు చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలు కూల్చివేస్తామని తెలిపారు.

ఆధునిక బోధనా పద్ధతులు అవలంబించాలి

డీఈవో బొల్లారం భిక్షపతి

దామరచర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆధునిక బోధనా పద్ధతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకర్షించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ జడ్పీహైస్కూల్, ఇంద్రానగర్ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, దామరచర్ల జడ్పీ హైస్కూల్ ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులను అభ్యసన వాతావరణంవైపు మళ్లించేందుకు భాషా కృత్యాలు, గణిత కృత్యాలతో పాటు కథలు చెప్పించడం, డిజిటల్ తరగతులు నిర్వహించడం వంటివి చేయించి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షించాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలను తరగతి గదిలో అమలుచేయకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఇంకా యూనిఫాం అందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థికి పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం వెంటనే పంపిణీచేయాలన్నారు. భవిత కేంద్రం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీనాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కేతావత్ సైదానాయక్, బండా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, వీరయ్య, రవి, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు

అమలు చేయాలి




సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం

మునుగోడు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు. మండలంలోని కొంపెల్లి గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు వేదికల్లో నడుపుతున్న ఈ కార్యక్రమం ఒక్కరోజు అవగాహనతో సరిపెట్టకుండా వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు సలహాలు సూచనలు ఇస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బొమ్మరగోని లాలు, సుర్గి చలపతి, ఈదులకంటి కైలాస్, బండారు శంకర్, దశరథ, వి. వెంకటేశ్వరరావు, యాదయ్య, పులకరం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఖర్చు.. ఏడాదికి రూ.150కోట్లు

పిల్లల చదువులకు తల్లిదండ్రుల జేబులు గుల్ల



పిల్లల ఖర్చులు తల్లిదండ్రులకు తలకు మించిన భారమవుతున్నాయి. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుచేసినా ప్రైవేట్‌లో చదివిపించాలన్న తహతహ తల్లిదండ్రులకు చిల్లులు పెడుతోంది. కేవలం పాఠశాల ఖర్చులే ప్రతీ ఏడాది రూ.125 కోట్లకు పైగా ఉంటాయని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. కళాశాలల ఖర్చు కలిపి రూ.25 కోట్ల వరకు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిప్రయాసలుపడి అయినా పిల్లలకు మంచి భవిష్యత్ కల్పించాలని తల్లిదండ్రులు పడుతున్న తపనను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట/ హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అనేక గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసింది. ఇందులో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే సీట్లు ఖాళీగా ఉండటంలేదు. ప్రతీ నియోజకవర్గంలో మైనార్టీ, జ్యోతిరావుపూలే బీసీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేశారు. ఇవేకాక మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కొన్ని 6 నుంచి 10వ తరగతి వరకు ఉంటే మరికొన్ని 5-8వ తరగతి వరకు, మరికొన్ని ఇంటర్ వరకు విద్యనందిస్తున్నాయి. గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో విద్యార్థి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. భోజనం, వసతి సౌకర్యం పొందవచ్చు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకా లు మాత్రమే కొనుగోలు చేయాలి. గురుకుల పా ఠశాలలకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి లో సీటు లభించని విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలకు మొగ్గు చూపకుండా ప్రైవేట్ వైపు వెళ్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో గతంలో కన్నా నాణ్యమైన విద్యను అందజేస్తున్నా విద్యార్థుల తల్లితండ్రులకు నమ్మకం కలగడంలేదు. ప్రైవేటు వెళ్లే విద్యార్థుల కోసం తల్లిదండ్రులు వెచ్చించే ఖర్చు తారాస్థాయికి చేరింది. అయినప్పటికీ పిల్లల భవిష్యత్ కోసం ఎంతో ఖర్చు చేస్తున్నారు.

యూనిఫాం కోసమే రూ.2500

ఇంగ్లీష్ మీడియంలో చదివిపించాలన్న తల్లిదండ్రుల ఆసక్తిని గమనించిన పాఠశాల యాజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. నర్సరీ తరగతులకు రూ.15వేలు వసూలు చేస్తున్నారు. ఇక పదవతరగతి విద్యార్థికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్న విద్యా సంస్థలూ ఉన్నాయి. యూనిఫాం కోసం రూ.2,500, పెన్నులు, స్టేషనరీ ఖర్చుల కోసం రూ.1000, పుస్తకాల కోసం రూ. 4 వేల నుంచి రూ.5వేల వరకు, హాస్టల్‌లో ఉంచితే కనీసం రూ.60 వేల నుంచి రూ.80వేలు వరకు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు ఉంటే ఖర్చు రూ.లక్ష దాటుతోంది. వీటికి తోడు కొన్ని పాఠశాలలు 5వ తరగతి నుంచి మెడిసిన్, ఐఐటీ ఫౌండేషన్ అంటూ అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ముందస్తు కోచింగ్‌ల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంత వసూలు చేస్తున్నా పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు రాజీ పడుతున్నారు.

అదిరిపోతున్న ఖర్చు

జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థికి కేవలం పుస్తకాల ఖర్చు రూ.5000 వసూలు చేశారు. ఇవే పుస్తకాలను బయట మార్కెట్లో కొనుగోలు చేస్తే రూ.1200 మించవు. కేవలం ఆ పాఠశాలల్లోనే తీసుకోవాలనే నిబంధనతో నాలుగు రెట్లు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. టై, బెల్ట్‌ల ఖరీదు కూడా విపరీతంగా వసూలు చేస్తున్నారని, నర్సరీకి కూడా రూ.25 నుంచి రూ.30 వేల ఫీజులు వసూలు చేసే పాఠశాలలు కూడా జిల్లా కేంద్రంలో ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట, కోదాడలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చదివించాలంటే తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. 6-10వ తరగతి వరకు వివిధ రకాల ఫౌండేషన్ పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు అధికంగా ఉన్నాయి.

ఫీజునియంత్రణకు చర్యలు తీసుకుంటాం: అశోక్, డీఈవో, సూర్యాపేట జిల్లా

ప్రైవేట్ పాఠశాల్లో అధిక ఫీజులు వసూలు చేయకుండా నియంత్రణ చేపడతాం. ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చాం. ప్రభుత్వ నిబంధనలకు లోబడి విద్యాసంస్థలను నిర్వహించాలి. ఎవరైనా ఫిర్యాదు చేసే చర్యలు తప్పకుండా తీసుకుంటాం.

జిల్లాలో 52 వేల మంది

జిల్లాలో 370 ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. అనధికారికంగా మరికొన్ని ఉంటాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనందిస్తున్నారు. ఇం దులో 1వ తరగతికి రూ.40 వేలు తీసుకుంటున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొంత తక్కువ మొ త్తంలో ఫీజులు ఉంటుండగా, పట్టణాల్లో ఫీజులు రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. మొత్తం జిల్లాలో 52 వేల మంది ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో విద్యార్థిపై సరాసరి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఫీజు ఉంటుండగా, ఆ తర్వాత బస్ చార్జీలు ఉంటున్నాయి.

ప్రైవేటు పాఠశాలలో ఫీజులను నియంత్రించాలి



ప్రైవేట్ పాఠశాలలో ఫీజులను నియంత్రించాలి. అడ్డూఅదుపు లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజుల నియంత్రణ కమిటీ ఏమైందో తెలియటం లేదు. ఒక విద్యార్థిని చదివించాలంటేనే ఎంతో ఖర్చు అవుతోంది. విద్యాహక్కు చట్టం అమ లు చేయాలి. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలి.

- సింహాద్రి, పీడీఎస్‌యూ నాయకుడు

ఫీజుల పేరుతో దోపిడీ



ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. పాఠశాల్లోనే పుస్తకాలు విక్రయిస్తున్న వారిని గుర్తించి గుర్తింపును రద్దుచేయాలి. విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ప్రతీ ఏడాది ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి. అధిక ఫీజులను నియంత్రించాలి.

- చందర్‌రావు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి

కోదాడ డిపో నుంచి సప్తక్షేత్ర సందర్శిని టూర్‌ప్యాకేజ్



కోదాడ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం సప్తక్షేత్ర సందర్శిని స్పెషల్ టూర్ ప్యాకేజీని మంగళవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రసిద్ధ దేవాలయాలైన అలంపూర్-జోగులాంబ అమ్మవారు, బీచుపల్లి-శ్రీఆంజనేయస్వామి, శ్రీరంగాపూర్-శ్రీరంగనాయకస్వామి, జటప్రోలు-శ్రీమదనగోపాలస్వామి, సోమశిల-శ్రీలలితసోమేశ్వరస్వామి, కొల్లాపూర్-శ్రీమాధవస్వామి, సింగోటం-శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను దర్శనం చేసుకునేలా సూపర్ లగ్జరీ బస్సుతో ప్రత్యేక టూర్ ప్యాకేజీ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు ఈ నెల 27న కోదాడ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందన్నారు. దర్శనాల అనంతరం 29న ఉదయం 8 గంటలకు కోదాడ డిపోకు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.1,800, పిల్లలకు రూ.1000 టికెట్ ధర ఉంటుందన్నారు. సీటు రిజర్వేషన్ కోసం 7780433533, 9573953143 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పక్కా నిర్మాణాలకు 'ఉపాధి' నిధులు

- **యాదాద్రిభువనగిరి జిల్లాకు రూ.8.47 కోట్ల కేంద్ర నిధులు**
- **63 పనుల గుర్తింపు**

యాదాద్రిభువనగిరి జిల్లాకు రూ.8.47 కోట్ల కేంద్ర నిధులు మంజూరయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన ఈ నిధులతో ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో 63 శాశ్వతనిర్మాణ పనులు చేపట్టనున్నారు. అందులో 26 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 పంచాయతీ భవనాలు, 27 పాఠశాలలకు ప్రహరీ నిర్మించనున్నారు. ఆయాపనులతో గ్రామాల్లోని ఉపాధి కూలీలకు పనిదినాలు లభించనున్నాయి.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ఆలేరు నియోజకవర్గంలో రూ.5.06 కోట్లు, మునుగోడుకు రూ.1.19 కోట్లు, తుంగతుర్తికి రూ.1.48 కోట్లు, నకిరేకల్ నియోజకవర్గంలో రూ.74లక్షలతో ఉపాధి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా భువనగిరి నియోజకవర్గానికి ఈ దఫాలో నిధులు రాలేదు. ఆయా శాఖల అధికారుల ప్రతిపాదనల మేరకు కేంద్రం నిధులు మంజూరు చేసినట్టు తెలిసింది. కాగా జిల్లాకు రూ.8.47 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోదీకి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పడానికి ఈ నిధుల మంజూరునే ఉదాహరణ అని అన్నారు.



అద్దె భవనంలోని అంగన్‌వాడీ కేంద్రం

26 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.3.12 కోట్లు

అద్దె భవనాలలో కొనసాగుతున్న 26 అంగన్‌వాడీ కేంద్రాలను ఒక్కొక్కటి రూ.12 లక్షలతో రూ.3.12 కోట్లతో శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ఆలేరు నియోజకవర్గంలోని తూర్పుగూడెం, పటేల్‌గూడెం, రేలప్లె, ఉప్పల్‌పహాడ్, బొమ్మలరామారం రెండుకేంద్రాలు), నూనెగూడెం, అనంతరం, అమ్మనబోలు, శాకంపల్లి, మొల్లగూడెం, చల్లూరు, మలకలపల్లి, దామారం, సాదువేల్లి, చిన్నకందూకూర్, మునుగోడు నియోజవవర్గంలోని డీ.మల్కాపూర్, జై.కేసారం, నారాయణపూర్, జనగాం, నకిరేకల్ నియోజకవర్గంలోని ఎన్నారం, సిరిపురం, తుంగతుర్తి నియోజకవర్గంలోని అజీంపేట్, గోవిందాపూర్, దత్తప్పగూడెం, పాలడుగులో నిర్మించనున్నారు.

● 10 గ్రామపంచాయతీలకు రూ.2కోట్లు

రూ.2కోట్లతో 10 పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ఒక్కొక్క భవనాన్ని రూ.20 లక్షలతో నిర్మించనున్నారు. ఆలేరు నియోజకవర్గంలోని కందాయితండా(ఆలేరు), కుర్రారం(రాజాపేట), కాజీపేట(బొమ్మలరామారం), మాసాన్‌నల్లి(గుండాల), గుజ్జవానికుంటతండా(తుర్కపల్లి), రాళ్లజనగాం(యాదగిరిగుట్ట), మునుగోడు నియోజకవర్గంలోని పెద్దకందూకూర్(చౌటుప్పల్), డాకుతండా(నారాయణపూర్), నకిరేకల్ నియోజకవర్గం ఇస్కిల్ల(రామన్నపేట), తుంగుర్తి నియోజకవర్గం అడ్డగూడూరు(అడ్డగూడూరు) ఉన్నాయి.

27 పాఠశాలలకు రూ.3.55 కోట్లతో ప్రహరీలు

జిల్లాలోని 27 ప్రభుత్వ పాఠశాలలకు రూ.3.55 కోట్లతో ప్రహరీలు నిర్మిస్తారు. ఆలేరు నియోజకవర్గంలోని 17 పాఠశాలలకు రూ.1.94 కోట్లతో ప్రహరీలు నిర్మిస్తారు. ఈ మేరకు కొలనుపాక, తిమ్మాపూర్, నాగినేనిపల్లి, ఇక్కుర్తి, సెమిలె, పారుపల్లి, చిన్నకందూకూరు, దాతరుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లు, పల్లెపహాడ్, కొలనుపాక, ఆత్మకూరు(ఎం), నూనెగూడెం, వంగాల, చామాపూర్, కాసర్లగూడ తండా, గుజవారికుంట ఎంపీపీఎస్ పాఠశాలలు, మర్రిపడగా యూపీఎస్, మునుగోడు నియోజకవర్గంలోని పీపుల్‌పహాడ్, జనగాం ఉన్నతపాఠశాల, చింతలగూడెం, కొట్లాపూర్ ప్రాథమిక పాఠశాలలు, నకిరేకల్ నియోజకవర్గంలోని కొమ్మాయిగూడెం, ఎన్నారం జడ్పీహెచ్‌ఎస్‌లు, తుంగతుర్తి నియోజకవర్గం డీ.రేపాక, మోత్కూర్ జడ్పీహెచ్‌ఎస్‌లు, దామారం, అనాజిపూర్ ఎంపీపీఎస్‌లకు ప్రహరి గోడలు నిర్మిస్తారు.

కేవైసీతో అర్హులకే సంక్షేమం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రేషన్‌కార్డు సభ్యుడు కేవైసీ(లబ్ధిదారుడి నిజనిర్ధారణ) చేసుకోవడం తప్పనిసరి చేసింది. ఈ నెల 30వ తేదీలోపు కేవైసీ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానంతో అర్హులకే సంక్షేమ పథకం అందనుండగా, అక్రమాలకు చెక్‌పడనుంది. ఇది ఆమోదయోగ్యమని, ఖచ్చితంగా అమలుచేయాలని పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి



గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరూ కేవైసీ చేసుకోవాలి. ముఖ్యంగా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు మంచి అవకాశం దొరుకుతుంది. కొన్నినెలలుగా ఈకేవైసీ ప్రక్రియ జరుగుతున్నా ఈ నెలాఖరు వరకు మరో అవకాశం కల్పించారు. ప్రస్తుతం సన్నబియ్యం అందిస్తుండడంతో ప్రజలు విజయవంతంగా రేషన్‌దుకాణాల సేవలను పొందుతున్నారు. 10 ఏళ్ల నుంచి అప్‌డేట్ కాలేదు. కేవైసీతో రేషన్‌కార్డుల్లో సమూలంగా మార్పు రానుంది.

చక్రహరి నాగరాజు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

కేవైసీతో అర్హులెవరో తెలుస్తారు



ప్రభుత్వాలు తీసుకొచ్చిన కేవైసీ విధానంతో అసలు ఎన్ని రేషన్‌కార్డులు జిల్లాలో ఉన్నాయో తెలుస్తుంది. అంతే కాకుండా చనిపోయిన, ఇతర కార్డుల్లో ఉన్నవారు, డబుల్ రేషన్‌కార్డుల వివరాలు తెలుస్తాయి. నిజమైన రేషన్‌కార్డుల సంఖ్య తేలుతుంది. గతంలో చనిపోయినవారి పేర్లు కొన్ని కార్డులోల ఉన్నా తొలగించలేదు. కొంతమందివి రెండు దుకాణాల్లో పేర్లు ఉంటున్నాయి. దీనిమూలంగా ఇబ్బంది ఎదురవుతోంది.

భాగ్యలక్ష్మి, గృహిణి

అక్రమాలకు చెక్‌పడుతుంది



రేషన్‌కార్డు ఉన్న వారు కేవైసీ చేసుకోవాలనే నిర్ణయం మంచిగా ఉంది. దీని వల్ల అక్రమ రేషన్‌కార్డులు లేకుండా పోతాయి. ప్రభుత్వానికి ఎంతో మేలు జరుగుంది. ఎక్కడా అవినీతి జరిగే అవకాశం ఉండదు. ప్రజలు కేవైసీ చేసుకోవాలి. రేషన్‌కార్డులు 10 ఏళ్ల నుంచి అప్‌డేట్ కాకపోవడంతో చనిపోయివారి పేర్లు తొలగలేదు. దీంతో అదనంగా రేషన్‌కోటా వస్తోంది. ఇకమీదట ఇలా జరిగే అవకాశం ఉండదు.

రామనర్సమ్మ, గృహిణి

సరైన కోటా చేరుతుంది



కేవైసీ చేయడం వల్ల రేషన్ దుకాణాల్లో సరైన కోటా ప్రజలకు అందుతుంది. అంతేకాకుండా అదనపు రేషన్‌కార్డులు మాయమవుతాయి. కేవైసీతో పాటు రేషన్‌దుకాణాలను ప్రజలకు దగ్గరగా ఉండేలా అదనంగా రేషన్‌కార్డులు ఏర్పాటు చేయాలి. దూరంగా రేషన్‌దుకాణాలు ఉండడంతో ప్రజలు కొంతఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సన్నబియ్యంతో పాటు గతంలో ఉన్న సరుకులు అందించాలి. ప్రతి నెలా చివరివరకు సన్నబియ్యం పంపిణీ చేయాలి.

గోగుల వీరబాబు, పట్టణ వాసి

భూవివాదంలో నిందితుల అరెస్టు

నల్లగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కనగల్ మండలం జీ చెన్నారం గ్రామంలో ఇటీవల తలెత్తిన భూవివాదానికి సంబంధించి ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నిరోజులుగా జీ చెన్నారం గ్రామంలోని సర్వేనెంబర్ 70,71లలోని వ్యవసాయ భూమి విషయంలో కూకట్ల శేఖర్, గార్లపాటి భూపాల్‌రెడ్డిల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 16న గార్లపాటి భూపాల్‌రెడ్డి అతడి భార్య రామేశ్వరమ్మలు కందిమల్ల రఘుమారెడ్డి, జమ్ముల ప్రభాకర్‌రెడ్డి సహాయంతో వివాదాస్పద భూమి మీదకు వెళ్లి భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న కూకట్ల శేఖర్ అక్కడికి చేరుకొని వారి అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారు అతడిని కులం పేరుతో దూషించడమే కాకుండా భౌతికదాడికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. దీంతో శేఖర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం గార్లపాటి భూపాల్‌రెడ్డి అతడి భార్య రామేశ్వరమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా ఈ కేసులో కందిమల్ల రఘుమారెడ్డి, జమ్ముల ప్రభాకర్‌రెడ్డిలు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న హైలెవల్ విచారణ

యాదగిరిగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరి కొండపైన చింతపండు దొంగతనంపై హైలెవల్ కమిటీ విచారణ మంగళవారం కూడా కొనసాగింది.రెండో రోజు కూడా ప్రసాదాల తయారీకేంద్రంలో విధులు నిర్వహించిన అధికారులు, వంటస్వాములను తిరిగి కమిటీ ప్రశ్నించింది. దోషులకు గుర్తించేందుకు కమిటీ మరింత లోతుగా విచారణ చేపట్టింది. ప్రసాదాల తయారీ కేంద్రంలో విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గడ్డమీది దిలీప్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రసాదాల తయారీ కేంద్రంలో పని చేసేవారి ప్రమేయం ఎంతమేర ఉందనే? అనే కోణంలో కమిటీ విచారణ జరిపినట్లు సమాచారం. సీసీ కెమెరాల పుటేజీని కమాండ్ కంట్రోల్ రూంలో పరిశీలించి కావాల్సిన సమాచారాన్ని నమోదు చేసినట్లు తెలుస్తోంది. దొంగతనం జరిగిన ప్రదేశాలను మరోక్కసారి పరిశీలించారు. తయారీ కేంద్రం వద్ద రాత్రిపూట భద్రత సిబ్బంది కారు పార్క్ చేసిన విషయాన్ని ఎందుకు గుర్తించలేదు? అన్న అంశాలను వివిధ వర్గాలను ప్రశ్నించి తెలుసుకుంటున్నారు. రెండు రోజులుగా కొనసాగుతున్న విచారణతో ఉద్యోగవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఖప్రాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సుంకరి రవిపై అదే గ్రామానికి చెందిన ఎరబోలు మహేష్ వ్యక్తిగత కక్షలతో దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు మహేష్‌ను మంగళవారం చౌటుప్పల్ కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సాగర్ వాసికి జీవితకాల సాఫల్య పురస్కారం



పురస్కారం అందుకున్న కిషోర్

నాగార్జునసాగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన గారపాటి జోజి కుమారుడు కిషోర్ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సర్జన్‌గా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే పేదలకు తక్కువ ఖర్చులో వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా ఛానల్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సర్జన్‌గా జీవితకాల సాఫల్య అవార్డును మంగళవారం హైదరాబాద్‌లో అందజేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



సుధాకర్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎం) జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని తుక్కాపురం గ్రామపంచాయతీ మదిరె పోసానికుంట గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోసానికుంట గ్రామానికి చెందిన సామ సుధాకర్‌రెడ్డి(48) అనే రైతు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గ్రామంలో తల్లిదండ్రులు ఉంటున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం సుధాకర్‌రెడ్డి పోసానికుంటకు వస్తూ వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని వెళ్తాడు. ప్రస్తుతం వ్యవసాయ బావి వద్ద వరి నాట్ల పనులు జరుగుతున్న సందర్భంగా ఇక్కడే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నీటిసంపు మోటార్ పనిచేయలేదు. సుధాకర్‌రెడ్డి మోటారు మరమ్మతు పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి మోటార్‌పై పడిపోయాడు. కొద్దిసేపటికే ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు చూసి చుట్టుపక్కల వారి సహకారంతో సుధాకర్‌రెడ్డిని భువనగిరి తరలించారు. అక్కడినుంచి హైద్రాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు సుధాకర్‌రెడ్డిని పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సుధాకర్‌రెడ్డి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. సుధాకర్‌రెడ్డికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు ..



ఇమామ్ మృతదేహం

మునగాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారులో సోమవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం కొమరబండకు చెందిన షేక్ ఇమామ్(20) ద్విచక్రవాహనంపై సోమవారం అర్ధరాత్రి వరంగల్ వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని, ఇమామ్ తండ్రి షేక్ దావూద్‌సాహేబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవినీతి ఆరోపణలతో ఆరుగురు కానిస్టేబుళ్లు బదిలీ?

కోదాడ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లను అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ ఆరుగురు ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీలను ఆపి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటుగా వీరిపై ఇటీవల ఎమ్మెల్యే పద్మావతికి సైతం కొంతమంది పార్టీ నాయకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం తీసుకెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను ఆపి డబ్బులు అడిగారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆరుగురిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ నివేదిక ఆధారంగా ఆరుగురు కానిస్టేబుళ్లను ఎస్పీ బదిలీ చేసినట్లు తెలిసింది. గత బక్రీద్ పండుగ సందర్భంగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న లారీల వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

సామాజిక గౌరవం దిశగా..

(5వ పేజీ తరువాయి)

శిక్షణ అందిస్తున్నారు. ముఖ్యంగా జాకెట్లు, లంగాలు, పంజాబీ డ్రెస్‌లతో పాటు ఇతర దుస్తువులకు సంబంధించిన కటింగ్ చేసి కుట్టు విధానాన్ని నేర్పిస్తున్నారు. రెండు నెలల పాటు శిక్షణ అందించనున్నారు.



కుట్టుశిక్షణ పొందుతున్న ట్రాన్స్‌జెండర్లు

ఉపాధి అవకాశాలు

కుట్టుశిక్షణతో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి లభించనుంది. వారు నివసించే ప్రాంతాల్లో అయినా, ఇతర చోట్ల అయినా కుట్టుమిషన్ ద్వారా వివిధరకాల దుస్తులు కుట్టి ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల కుట్టు విభాగంలో అనేక నూతన పద్ధతులు వచ్చాయి. అల్లికలు, బొటిక్‌తో పాటు ఇతర పద్ధతులను కూడా నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. శిక్షణ అనంతరం స్వయంఉపాధికి అవసరమైన సాయం కూడా ప్రభుత్వం నుంచి అందించనుంది.

పైలెట్ ప్రాజెక్ట్‌గా కుట్టుశిక్షణ

ట్రాన్స్‌జెండర్లకు సూర్యాపేటలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుశిక్షణ రాష్ట్రంలోనే మొదటిది. ట్రాన్స్‌జెండర్ల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం నుంచి చేపట్టిన కార్యక్రమాలు ఇప్పటి వరకు లేవు. కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ట్రాఫిక్ విధుల్లోకి తీసుకున్నారు.

సమాజానికి స్ఫూర్తి కలిగించేలా ట్రాన్స్‌జెండర్లకు జీవనోపాధి అందించేందుకు ఒక విప్లవాత్మకమైన మార్పు కోసం సూర్యాపేటలో కుట్టు శిక్షణను ప్రారంభించారు.

శిక్షణతో జీవనోపాధికి దోహదం



ప్రభుత్వం అందించే ఉచిత కుట్టు శిక్షణ జీవనోపాధికి దోహదపడనుంది. కుట్టు శిక్షణ అనంతరం స్వయం ఉపాధి పొందుతూ సమాజంలో గౌరవంగా జీవిస్తాం. ట్రాన్స్‌జెండర్లంటే సమాజంలో చిన్నచూపు ఉంది. కుట్టు శిక్షణ ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో కొత్త ఆశాకిరణం. కుట్టు శిక్షణను ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకోవాలి.

తనుశ్రీ, ట్రాన్స్‌జెండర్, సూర్యాపేట.

గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకే



ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో గౌరవప్రద మైన జీవితాన్ని అందించేందుకు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయించారు. ఈ శిక్షణతో వారు స్వయంఉపాధి పొందనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు ఎక్కడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. ట్రాన్స్‌జెండర్లు ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

నర్సింహరావు, సంక్షేమాధికారి, సూర్యాపేట జిల్లా

మీరే ఆదర్శం కావాలి



నల్లగొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. 'మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారా' అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదువుకొని మీరే ఆదర్శం కావాలని సూచించారు. ●ఆంధ్రజ్యోతి చందంపేట)

తొలి అక్షరం కావాలి.. భవిష్యత్‌కు అందలం



నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తల్లిదండ్రులతో కలిసి సూపర్‌వైజర్ సీహెచ్. నాగరాణి మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాసం భవిష్యత్‌కు తొలిమెట్టు కావాలని ఆకాంక్షించారు. ● ఆంధ్రజ్యోతి అడవిదేవులపల్లి

భద్రతలో రాజీలేదు



సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్‌తో పాటు జాతీయ రహదారి వెంట తనిఖీలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సూర్యాపేటలో ప్రత్యేక నిఘా ఉంచుతామని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. ప్రయాణికులు, ప్రజలకు పూర్తిస్థాయి భద్రత కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ● ఆంధ్రజ్యోతి, సూర్యాపేట క్రైం.

పరిసరాల శుభ్రత మన చేతిలోనే



పరిసరాల పరిశుభ్రత మన చేతిలోనే ఉందని మునిసిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ● ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్.

వైభవంగా చక్రతీర్థోత్సవం



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవతామూర్తులను సింహ, అశ్వ, గజ, శేష, హంస వాహనాలపై శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు చక్రతీర్థోత్సవం నిర్వహించారు. ● ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్.

నాణ్యతపై పరిశీలన



యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన సీసీరోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. నిర్మించిన కొద్ది కాలానికే పగుళ్లు పట్టాయని బీజేపీ నాయకుల డిమాండ్‌తో అధికారులు పరిశీలించారు.
● ఆంధ్రజ్యోతి, మోత్కూరు.

లబ్ధిదారులే నిర్మాణకర్తలు

(5వ పేజీ తరువాయి)

ఇళ్లతో పాటు, బేస్‌మెంట్, లెంటల్ స్థాయికి వచ్చిన మరో 2వేల ఇళ్లకు కలిపి బీఎల్‌సీ పద్ధతిలో నిర్మాణాలను పూర్తిచేసేందుకు తాజా నిర్ణయంతో వెసులుబాటు కలిగినట్లయింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడంతో పాటు, ఇళ్లు నిర్మించిన కాలనీల్లోనూ పూర్తిస్థాయిలో రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. తక్షణమే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసి, మౌలిక వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. స్థానిక ఎన్నికలలోపు లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.



నల్లగొండ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

లబ్ధిదారుల ఎంపికపై ఉత్కంఠ

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, సూర్యాపేట, తుంగతుర్తి తదితర ప్రాంతాల్లో అప్పటి ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను డ్రా విధానంలో ఎంపిక చేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆ లబ్ధిదారులకు అందించలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఎల్‌సీ విధానంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని సంకల్పించిన నేపథ్యంలో గత లబ్ధిదారులకే ఇస్తారా? లేక కొత్తగా లబ్ధిదారులను ఎంపికచేస్తారా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. తమకే ఇళ్లను అందజేయాలని గత లబ్ధిదారులు ధర్నాలు, ఆందోళనలు చేసిన పరిస్థితి కొనసాగింది. తాజాగా, వీటిపై ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఉన్న నిధులతో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని హౌసింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

స్థానికంపై బీజేపీ గురి

(5వ పేజీ తరువాయి)

విస్తృత ప్రచారం నిర్వహించనుంది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీజేపీ నేతలు కేంద్రం నుంచి రాష్ట్రానికి పలు పథకాలకు విడుదలైన నిధుల సమాచారాన్ని జిల్లా అధికారుల నుంచి సేకరిస్తున్నారు. రాష్ట్రం, జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఎయిమ్స్ బోర్డు సభ్యురాలిగా ఉన్న మహమూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇటీవల యాదాద్రి జిల్లాలోని ఎయిమ్స్‌ను సందర్శించారు. ఎయిమ్స్‌లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోందనే ప్రచారం కల్పించేందు కు ఆమె ఎయిమ్స్‌ను సందర్శించిరు. అదేవిధంగా కేంద్ర ప్రభు త్వం ప్రధానంగా ఉపాధి హామీ పథకం, ఆయుష్మాన్‌భవ, తదితర పథకాల కింద నిధులు విడుదల చేస్తోంది. ఏ పథకం కింద ఎంత మేరకు నిధులు మంజూరు చేసిందనే అంశాన్ని జనాల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ యత్నిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద యాదాద్రి జిల్లాకు 63 నిర్మాణ పనులకు రూ.8.47కోట్లు, 10 గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలకు రూ.2కోట్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం రూ.3.12కోట్లు, 27స్కూళ్ల ప్రహరీగోడ నిర్మాణానికి కేంద్రం రూ.3.35కోట్లు విడుదల చేసింది. వీటిపై స్థానిక బీజేపీ నేతలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో పట్టుసాధిస్తాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పట్టు సాధిస్తుంది. పట్టణాల్లో పార్టీ బలంగా ఉంది. పల్లెల్లోనూ పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని పార్టీలతో సమ ఉజ్జీగా పోరాడుతుంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తాం.



● ఉట్కూరి అశోక్‌గౌడ్, యాదాద్రిభువనగిరి బీజేపీ జిల్లా అధ్యక్షుడు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



యాదగిరిగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 23,19,119 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	513.80 అడుగులు
టీఎంసీలు	138.2126
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.55 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	641.40 అడుగులు
టీఎంసీలు	3.54
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	90.77క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	370.48క్యూసెక్కులు

రూ.303కోట్ల 'రైతు భరోసా' జమ

● ఇప్పటివరకు 3,85,318 మంది రైతులకు లబ్ధి ● కొత్తగా పాసు పుస్తకం వచ్చిన రైతులకూ పైకం

నల్లగొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం 24 గంటల్లోనే రికార్డు స్థాయిలో రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. సోమవారం సాయంత్రం 5గంటల నుంచి మంగళవారం సాయంత్రం 5గంటలలోపు జిల్లాలోని 3,85,318మంది రైతుల ఖాతాలో రూ.303.72 కోట్లకు పైగా పైకం జమ చేసింది. దీనికి తోడు మంగళవారం నాడు అదనంగా రూ.105కోట్లను ట్రెజరీలో జమ చేసింది. ఆ నిధులు కూడా రాత్రిలోగా రైతుల ఖాతాల్లో వేయనున్నారు. ఇప్పటికే మూడు ఎకరాలకు పైగా ఉన్న రైతులందరికీ రైతుభరోసా నిధులు కేటాయించారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 5,65,803 మంది రైతులకు రూ.738.67కోట్లకు పైగా చెల్లిం చాల్సి ఉంది. ఇందుకుగాను ఇప్పటికే రూ.516.63 కోట్లు ట్రెజరీకి వచ్చాయి ఇందులో రూ.303 కోట్లకు పైగా డబ్బులు జమ అయ్యాయి. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో జిల్లాలోని సాగుభూమికి డబ్బు జమ చేయనున్నారు. ఈ వారం రోజుల్లో మిగిలిన 1,80,485మంది రైతులకు మరో రూ.222కోట్లు ట్రెజరీకి విడుదల చేస్తే జిల్లాలోని రైతులకు రైతుభరోసా వర్తించనుంది.

కొత్త పట్టాదారులు బ్యాంకు ఖాతా నెంబర్ ఇస్తే రైతు భరోసా

ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పాసుపుస్తకం వచ్చిన రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయనున్నారు. తక్షణమే మండల వ్యవసాయ శాఖ అధికారులను కలిసి తమ బ్యాంకు ఖాతా నెంబర్లు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి. శ్రవణ్‌కుమార్ కొత్తగా పాస్‌పుస్తకం పొందిన రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 9,500 మంది రైతులు కొత్తగా పాస్ పుస్తకాలు పొందారని వారందరికీ రైతుభరోసా వర్తించనుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లాలో 2024 సంవత్సరంలో విడతల వారీగా రుణమాఫీ పొందిన లబ్ధిదారుల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు జేడీఏ తెలిపారు.

రూ.204.83 కోట్లు రుణమాఫీ విడుదల

మొత్తం నాలుగు విడతల్లో 2,33,981మంది రైతుల ఖాతాలకు రూ.2004.83కోట్లను రైతుల ఖాతాలకు రుణమాఫీకి సంబంధించి కేటాయించినట్లు జేడీఏ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

నియోజకవర్గం	రైతులు	నిధులు(కోట్లు)
నాగార్జునసాగర్	38,828	రూ.329.19
దేవరకొండ	42,354	రూ.379.07
మిర్యాలగూడ	25,703	రూ.197.34
మునుగోడు	39,211	రూ.345.67
నకిరేకల్	32,821	రూ.280.87
తుంగతుర్తి	34,461	రూ.291.46
నల్లగొండ	20,606	రూ.181.41

చేనేత రిజర్వేషన్లు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చేనేత రిజర్వేషన్ యాక్ట్ -1985 ప్రకారం చేనేతకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్లను ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెన్నైలోని డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్ ప్రాంతీయ కార్యాలయ అధికారులు ముజేంద్రనాథ్, దీపక్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి చేనేత సహకార సంఘం భవనంలో ఎన్‌హెచ్‌డీసీ ఆధ్వర్యంలో మంగళవారం భూదాన్ పోచంపల్లి బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్‌కు కేటాయించిన జీఐఏ (జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్) అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏ ప్రాంతంలోని వస్త్రోత్పత్తులు ఆ ప్రాంతంలోనే తయారు చేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపి చర్యలు తీసుకుంటారని అన్నారు. అంతేగాక చేనేతకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్లను కాపీ కొట్టడం కానీ, డూప్లికేషన్ చేయడం కానీ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాల్లోగాని, ఇతర దేశాల్లోగాని చేనేత రిజర్వేషన్లు కాపీ కొడితే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. చేనేతకు రిజర్వు చేసిన వస్త్ర రకాలు ఏప్రాంతానికి చెందినవి ఆ ప్రాంతంలోనే తయారు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో, ఇతర ప్రాంతాల్లో తయారు చేయడం నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రాజేశ్వర్‌రెడ్డి, రంజిత్, మేనేజర్ రుద్ర ఆంజనేయులు, చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత నాయకుడు తడక రమేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీసీహెచ్ చెన్నై రీజనల్ ఆఫీస్ అధికారి ముజేంద్రనాథ్

రేపు గుట్టలో దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం

యాదగిరిగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రధాన (యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర) దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ దేవాలయాల జేఏసీ చైర్మన్ గజ్వేల్లి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న యాదగిరిగుట్ట దేవస్థానం పాత గోశాలలో జరుగు సమావేశానికి ప్రధాన దేవాలయాల ఉద్యోగులతో పాటు టీఎన్జీవోల సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ పాల్గొననున్నారని తెలిపారు.

నల్లగొండ జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ టౌన్, కేతేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఇప్పటి వరకు వీఆర్‌లో కొనసాగుతున్న యు. సతీష్‌ను కేతేపల్లి పీఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న ఏ. శివతేజను వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎం. రవికుమార్‌ను చిట్యాలకు అక్కడ పనిచేస్తున్న ఎన్. ధర్మను వీఆర్‌కు స్థాన చలనం కల్పించారు.

సాగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

నాగార్జునసాగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను ట్రైనీ ఐఏఎస్‌లు మంగళవారం సందర్శించారు. తెలంగాణకు కేటాయించిన ఐఏఎస్‌లు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్నారు. తెలంగాణ దర్శినిలో భాగంగా వారు సాగర్ సందర్శనకు వచ్చారు. సాగర్ బుద్ధవనానికి చేరుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు సౌరబ్‌శర్మ, క్యారోలిన్ చింగ్‌తీ అమ్మాపై మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌తో సమావేశమయ్యారు. అనంతరం బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత బుద్ధ చరిత వనం, ధ్యాన వనం, జాతక వనం, స్థూప వనం, మహాస్థూపాలను తిలకించారు. మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో జ్యోతి వెలిగించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం డాక్యుమెంటరీని తిలకించారు. వారికి బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, ఈవో శాసన బుద్ధవనం బ్రోచర్‌లతో పాటు పంచశీల కండువాలు అందజేశారు. అనంతరం జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాలను తిలకించారు. పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి సాగర్ చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దర్శన్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.





నాగార్జునసాగర్ బుద్ధవనంలో ట్రైనీ ఐఏఎస్‌లు, బుద్ధుడి పాదాలకు అంజలి ఘటిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

చిట్యాల, జూన్17, (ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. కగార్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చిట్యాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ,ఐతరాజు నర్సింహ్మ, బొబ్బల సుధాకర్‌రెడ్డి, గుడిసె లక్ష్మీనారాయణ, జిట్ట స్వామి, రాములు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, జూన్17, (ఆంధ్రజ్యోతి) :మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.అంతకుముందు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి సహస్రనామార్చన పూజలను నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సమాచారం

ఆదర్శ పాఠశాలలో పీజీటీ ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తులు

కేతేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఫిజిక్స్ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మమత కోరారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ ఫిజిక్స్, బీఈడీలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 19వ తేదీలోగా అభ్యర్థులు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. 21న డెమో, ఇంట ర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు.

రేపు పాలస్తీనా సంఘీభావ నిరసనలు జయప్రదం చేయండి

నల్లగొండ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పాలస్తీనకు సంఘీభావ దినంగా పాటిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పట్టణాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20 నెలలుగా గాజాలోని పాలస్తీనా ప్ర జలపై ఇజ్రాయెల్ నిరంతర దాడులు కొనసాగిస్తున్నది. మారణ హోమాన్ని సృష్టి స్తూ యుద్ధానికి పూనుకున్నదని పేర్కొ న్నారు. నిరసనలు విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



రామగిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రి జయంత్ సింగ్ చౌదరిని కోరారు. మంగళవారం ఆయన మంత్రి నివాసంలో మర్యాదపూర్వక కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో నైపు ణ్యం గల యువత ఎంతో మంది ఉన్నప్ప టికీ వారికి ఉపాధి కల్పించడంలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఫలితంగా యువత అభివృద్ధి పథంలో రాణించలేకపోతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాగం తెలిపారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా మారేనా!

» నార్కట్‌పల్లి పెద్ద చెరువు పై మాటలకే పరిమితమైన నేతల హామీలు » మినీట్యాంక్ బండ్‌గా మారిస్తే సందర్శకుల సందడి



(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నార్కట్‌పల్లి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామన్న నేతల హామీలు మాటలుగానే మిగిలాయి. మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరూ హామీ ఇచ్చారు.సుమారు 480ఎకరాల శిఖం గల పెద్ద చె రువును గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీ య పథకం కింద గుర్తించినప్పటికీ కేవలం పూడికతీ త పనులను మాత్రమే చేశారు. రాష్ట్రం ఏర్పడి దశా బ్ది ఉత్సవాలు నిర్వహించిన సమయంలో కూడా నీటి పారుదల శాఖపై నకిరేకల్ నియోజకవర్గ స్థాయి సభనార్కట్‌పల్లిలో నిర్వహించిన సమయంలో పెద్ద చెరువును మినీట్యాంక్‌బండ్‌గా మారుస్తామని ప్రకటించారు. ఇందుకోసమేనన్నట్లుగా నాలుగేళ్ల క్రితం చెరువులో, కట్టకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను సుమారు రూ.3లక్షల అంచనా వ్యయంతో తొలగించే పనులను చేశారు. కానీ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం కేవలం మాటలకే పరిమితమైంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా ఈ చెరువును మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించినప్పటికీ ఆదిశగా కార్యాచరణ కనపడటం

రోడ్లపై వాకింగ్ చేస్తున్నాం



ఆరోగ్యం కోసం ఉదయపు నడక చేద్దామంటే అనువైన స్థలం లేదు. దీంతో రోడ్లపైనే వాహనాల రణగొణ శబ్దాల మధ్య వాకింగ్ చేస్తున్నాం. పల్లె ప్రకృతి వనం ఉన్నా నిర్వహణ కొరవడటంతో రోడ్లపైనే మార్నింగ్ వాక్ తప్పడం లేదు. అదే నార్కట్‌పల్లి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చి ఉంటే రాబోయే రోజుల్లో బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ కాల్వ ద్వారా చెరువులోకి నీరు చేరి ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణం మధ్య కుటుంబ సభ్యులతో కలిసి వాకింగ్ చేస్తూ ఉల్లాసాన్ని పొందే అవకాశముండేది. కనీసం ప్రస్తుతం ఉన్న చెర్వుకట్ట మీద వాకింగ్ చేద్దామనుకున్నా కంపచెట్లు పెరిగి దారిని కమ్మేస్తున్నాయి. అధికారులు స్పం దించి నార్కట్‌పల్లి పెద్ద చెర్వును మినీ ట్యాంక్‌బండ్‌గా మారిస్తే పట్టణవాసులకు ఎంతో మేలు చేసినట్లవుతారు.

- నీలం శివ, స్థానికుడు

మినీ ట్యాంక్‌బండ్‌గా మారిస్తే



నార్కట్‌పల్లి మినీ ట్యాంక్ బండ్‌గా మారిస్తే ప్రజలకు బహుళ ప్రయోజనకరంగా ఉండేది. ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్, గ్రాస్ టర్ఫింగ్, కట్టకు చూట్స్ నిర్మాణం (వర్షం వచ్చినపుడు కట్టపై నీరు నిలవకుండా కిందకు చేరవేసే మార్గం), కట్ట పొడువునా లైటింగ్, బతుకమ్మ ఘాట్, రివిట్‌మెంట్, వంటి పనులతో పాటు ప్రస్తుతం ఉన్న కట్ట వెడల్పును 3 మీటర్ల నుంచి కనీసం 7 మీటర్ల వరకు పెంచి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని భావించారు. దీంతో కట్టమీద ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క ల్పించి సందర్శకుల వచ్చేలా చేయాలని సంకల్పించా రు. పైగా కట్టమీదుగా మాండ్రకు వెళ్లే వారికి దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అయ్యేది. పెద్దచెరువును పూర్తి స్థాయి లో మినీట్యాంక్‌బండ్‌గా మా ర్చేందుకు సుమారు రూ2కోట్లు అవుతుండొచ్చని ఐబీ అధి కారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిపాదనలు రాలే..

మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం నుండి మాకు రాలేదు. గత ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధులు పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ గురంచి మాకు తెలియదు. ఒకవేళ మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు అంచనా తయారు చేయాలని ప్రతిపాదనలు వస్తే సిద్ధం చేస్తాం.

- రమాదేవి, ఐబీ ఏఈ: నార్కట్‌పల్లి పెద్దచెర్వు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

కనగల్, జూన్17,(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలోని పలు అంశాలపై అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పైలట్ ప్రాజెక్టను ఎంపీడీవో జయరాం ఆధ్వర్యంలో కార్యదర్శులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ఇందిరమ్మ ఇళ్ల వివరాలను కార్యదర్శులకు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్, ఫొటో అల్బమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కొలతల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరపాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ పలు సూచనలు సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సుమలత, మాజీ సర్పంచ్‌బోగరి రాంబాబు తదితరులున్నారు.

నీట్‌లో ఆలిండియా ర్యాంకర్‌కు అభినందన



ఆలిండియా ర్యాంకర్ ప్రియాంకు ను అభినందిస్తున్న డీఐఈవో దస్రూనాయక్

నల్లగొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) నీట్ ఫలితాల్లో ఆలిండియా 100 వ ర్యాంక్ సాధించిన పట్టణంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినిబచ్చు ప్రియాంకని డీఐఈఓ దస్రూనాయక్ అభినందించారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఆలిండియా ర్యాంక్ సాధించిన ప్రవళికతో పాటు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పావని, లేఖన, ప్రవల్లిక, జ్యోతి, గాయత్రి, దివ్య, ధరణిలకు నిర్వహించిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బొకేలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మనోజ్ రెడ్డి , డీన్ కిషోర్ బాబు, ఏఓ సరితారెడ్డి, అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న, శ్రీనివాస్, శోభ తదితరులు విద్యార్థినులను అభినందించారు.

గ్రామీణ రోడ్లు 5.5 మీటర్ల వెడల్పుతో నిర్మించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో నిర్మించే గ్రామీణ రహదారులన్నీ 3.75 నుంచి 5.5 మీటర్ల వెడల్పుతో మార్పు చేసి నిర్మించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రహదారులపై పురోగతిపె క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 57 రహదారుల పనులు నిర్మాణంలో ఉండగా 34 పీఆర్ పనులు టెండరింగ్ ప్రక్రియలో ఉన్నాయి. పనుల పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం రహదారుల పనుల్లో నాణ్యతను పక్కాగా పాటించాలన్నారు. గ్రామాల్లో నిర్మించే ప్రతిగ్రామీణ రహదారిని 5.5మీటర్ల వెడల్పుతో మార్చి నిర్మించాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణం కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరి చేయించే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, పీఆర్, ఆర్అండ్‌బీ డీఈలు నాగేశ్వరరావు, శరత్‌చంద్ర, పీఆర్ ఏఈ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శంగా ప్రధానోపాధ్యాయుడు

» తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన వైనం



హెచ్ఎంను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

మర్రిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అజిలాపురం గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాపోలు నవీన్ తన రెండో కుమార్తె అమూల్యను అదే పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచాడు. నవీన్ భార్య కూడా ఎం. శ్రీవాణి చింతపల్లి మండలం మాల్‌లోని వెంకటేశ్వర నగర్ జడ్పీ హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే పెద్ద కుమార్తె అనన్యను శ్రీవాణి విద్యా బోధిస్తున్న హైస్కూల్‌లో 9వ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే పాఠశాలలు బలోపేతం అవుతాయని నమ్మకంతో తమ పిల్లలను చేర్పించామని ప్రధానోపాధ్యాయుడు నవీన్ వెల్లడించారు. ఇద్దరి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన నవీన్‌ను ఎంఈవో బిట్టు శ్రీనివాస్ అభినందించారు.

ప్రధాని మోదీ హయాంలో దేశాభివృద్ధి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న దూడల భిక్షంగౌడ్

మునుగోడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో 11ఏళ్ల పాలనలో శక్తివంతమైన దేశంగా అభివృద్ధి చెందిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, కర్నాటి లింగయ్య, సతీష్, యాదయ్య, కృష్ణ, విష్ణు, రమేష్, స్వామి, నరేష్, వెంకటేశ్వర్లు, రాము, శంకర్, రాములు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రైతు భరోసా

మర్రిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందుతుందని ఆదివాసి కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు రామావత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలో అయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 70,11,184 మంది రైతులకు ఎకరానికి రూ.6వేల చొప్పున రూ. 1.49 కోట్ల ఎకరాలకు రూ.9వేల కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని అన్నారు. భూమి సాగు చేసే ప్రతి రైతుకూ రైతు భరోసా అందుతుందన్నారు. కార్యక్రమంలో రవినాయక్, రాంమూర్తి, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ అన్నారు. సంజీవిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి పైగా కార్మికులకు డాక్టర్ హనుమంత్‌మాలి బీపీ షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. మిగిలిన కార్మికుల కూడా మరో విడతలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, గడ్డం శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, జవాన్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కార్పెంటర్ దుకాణాలపై దాడులు ఆపాలి

నల్లగొండ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్పెంటర్ షాపులపై అటవీ శాఖ అధికారులు దాడులను ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ కార్పెంటర్ వర్కర్స్ యునియన్ ఆధ్వర్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కార్పెంటర్ షాపులకు అటవీశాఖ అధికారులు వచ్చి వేప, తుమ్మ, కలప నిల్వ ఉండొద్దని, ఉంటే సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో నర్సింహ, రవీందర్, సైదాచారి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మర్రిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని చెల్లం ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో యాదయ్య మాట్లాడారు. సీపీఎం పార్టీ మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య హాజరై మాట్లాడారు.జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు, మేధావులు, ఉపాధ్యాయులు, యువత, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, సల్వోజ్ రామలింగాచారి, దామెర లక్ష్మి, ఆయిల్ కృష్ణయ్య, మాడుగుల అంజయ్య ఆపాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలందించాలి

» ఎల్ఐసీ సౌత్ జోన్ మేనేజర్ పునీత్‌కుమార్



బ్రాంచ్-2 నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ పునీత్ కుమార్

నల్లగొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాలసీదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎల్ఐసీ సౌత్ జోన్ మేనేజర్ పునీత్ కుమార్ స్పష్టం అన్నారు. మంగళవారం పట్టణంలో ఎల్ఐసీ బ్రాంచ్ -2 నూతన భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలోని ఎల్ఐసీ ఏజెంట్లందరూ 10వేల పాలసీలను విక్రయించి, రూ.45 కోట్ల బిజినెస్ చేయాలన్నారు.. ప్రతి ఉద్యోగి, ఏజెంట్ కష్టపడి పనిచేసి ఎల్ఐసీ ఆస్తులను పరిరక్షించాలన్నారు. ఎల్ఐపీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.. అనంతరం స్థానిక పోలీస్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏజెంట్లు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. తదనంతరం ప్రతిభ కనబర్చిన ఎల్ఐసీ ఏజెంట్లను సన్మానించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ జి.మధుసూదన్, మార్కెటింగ్ మేనేజర్ బీఎన్ త్రిపాఠి, నల్లగొండ ఎల్ఐసీ బ్రాంచ్-2 మేనేజర్ జి.శ్రీనివాస్, బ్రాంచ్-1 మేనేజర్లు డి.జయప్రకాష్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ఎల్ఐసీ అధికారులు వెంకన్న, రాజు, బీఎన్ రావు ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏజెంట్ల సంఘం నాయకులు జెడ్ఎంకు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ కార్మికులు

నల్లగొండ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ఖమ్మంలో జూన్ 21,22 తేదీల్లో నిర్వహించే ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కెఎస్‌రెడ్డి, డిపో గౌరవాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ ఆర్టీసీ డిపో ఎదుట మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పైన ఎస్‌డబ్ల్యూఎఫ్ స్పందిస్తుందన్నారు. ఆర్టీసీలో ఐక్య పోరాటాలు బలపడాలంటే ఎస్ డబ్ల్యూ ఎఫ్ బలపడాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఆర్టీసీలో ఐక్య పోరాటాలు, ఆర్టీసీ పరిరక్షణ, ప్రభుత్వ విధానాల వల్ల వస్తున్న సమస్యలపై ఈ మహాసభలో అనేక తీర్మానాలు ఆమోదించి పోరాటాలకు రూపకల్పన చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ ఎంసీ మౌళీ గద్దర్ నరసింహ, కె యాదగిరి, శంకరయ్య, పాల్గొన్నారు.

రైతు భరోసా వేయడం హర్షణీయం

శాలిగౌరారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎకరాలతో సంబంధం లేకుండా భూమి ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులను రైతు ఖాతాలో జమ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ మండల నాయకుడు నిమ్మల మధు గౌడ్ అన్నారు. మంగళవారం మండలం రామగిరిలో విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మందుల సామేల్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో పార్టీ ప్రతిష్టను పెంచి కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు.

ఆర్ఎల్‌డీలో చేరిక



కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిని జయంత్ సింగ్‌కు పరిచయం చేస్తున్న దిలీప్‌కుమార్

నార్కట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన విద్యావేత్త, లోటస్ లాప్ పాఠశాలల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ) పార్టీలో చేరారు. ప్రస్తుతం ఇదే గ్రామానికి చెందిన కోమటిరెడ్డి బ్రదర్స్ అనుచరుడిగా కాంగ్రెస్‌లోనే ఉన్న ఆయన బుధవారం ఆర్ఎల్‌డీలో చేరారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జయంత్ సింగ్‌చౌదరిని మర్యాద పూర్వకంగా గోపాల్‌రెడ్డిని కలిశారు. గోపాల్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి ఆర్ఎల్‌డీలోకి సాదరంగా జయంత్‌సింగ్ చౌదరి ఆహ్వానించి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనను ఆర్ఎల్‌డీలో చేర్చుకుని తనపై ఎంతో నమ్మకంతో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన జయంత్ సింగ్‌కు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్, ఇందిరలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం



శాలిగౌరారం: చిత్తలూరులో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో


నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, మునగోడు రూరల్, శాలిగౌరారం, కనగల్ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా నమోదైన చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, లింగస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, టీచర్లు నిర్మల, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, వెలిమినేడు, ఆరెగూడం, బొంగోనిచెర్వులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. వెలిమినేడులో అంతటి పారిజాతా నర్సింహాగౌడ్ చిన్నారులకు ప్లేట్లు, పలకలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రేవతి, పీఏసీఎస్ చైర్మన్ రఘుమారెడ్డి, కాటం సత్తయ్య, దేశబోయిన మల్లేశ్, జహంగీర్, బైకాని అండాలు, పారిజాత, వాణి పాల్గొన్నారు.

● మునుగోడు మండలంలోని చీకటి మామిడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సీడీపీవో లావణ్యకుమారి అక్షరాభాస్యం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్ శివేష, అంగన్‌వాడీ టీచర్లు పి.విజయ, పి.శోభ, ఎస్.రజని తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎంఈవో మందుల సైదులు ౧ సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకన్న, నర్సయ్య, ఐసీడీస్ సూపర్ వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు తరాల శోభారాణి, జి.లలిత, కె. వసంత, ఎస్.అనిత పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీలత చిన్నారులతో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి పద్మ, అంగన్‌వాడీ టీచర్ అరుణ, జ్ఞానేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నల్లగొండ
5
బుధవారం 18 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	23.0

రూ.303కోట్ల
'రైతు భరోసా' జమ
- ఇప్పటివరకు 3,85,318 మంది రైతులకు లబ్ధి
- కొత్తగా పాస్‌పుస్తకం వచ్చిన వారికీ పైకం

7

లబ్ధిదారులే నిర్మాణకర్తలు



నల్లగొండలో నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

అసంపూర్తిగా నిలిచిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారు నేతృత్వంలో బీఎల్‌సీ (బెనిఫీషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అందుకోసం తొలుత ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల వరకు గరిష్ఠంగా నిధులు కేటాయిస్తూ పెండింగ్ పనులను ఈ విధానంలో పూర్తిచేయాలని నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- వారే నిర్మించుకునేలా నూతన విధానం
- ఒక్కో ఇంటికి గరిష్ఠంగా రూ.5లక్షలు
- లబ్ధిదారులను త్వరగా ఎంపిక చేయాలని మంత్రి ఆదేశం
- ఆశావహుల ఎదురుచూపు

గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. బీఎల్‌సీ విధానం ప్రవేశపెట్టడం ద్వారా దాదాపు ఏడాదిన్నరకాలంగా పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. వీలైనంతవేగంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి ఆదేశించడంతో ఆ మేరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. స్థానికసంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో కీలకమైన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని నిర్ణయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అందుబాటులో 4,716 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 20వేల ఇళ్లను మంజూరు చేయగా, వాటిల్లో కేవలం 6,360 ఇళ్లు మాత్రమే నిర్మించారు. నిర్మించిన ఇళ్లల్లోనూ ఎన్నికల సమయానికి కేవలం 1,644 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించారు. మరో 4,716 ఇళ్లు అర్హులకు కేటాయించకపోవడం, వాటికోసం ఎన్నికల షెడ్యూల్ వచ్చేంతవరకు లబ్ధిదారుల ఎంపికపై అప్పటి ఎమ్మెల్యేలు సందిగ్ధంలో ఉండటంతో చివరికి ఇళ్లను ఎవ్వరికీ కేటాయించలేకపోయారు. ఆ ఇళ్లల్లో ప్రస్తుతం ఎవ్వరూ నివాసం ఉండకపోవడంతో క్రమంగా అవి శిథిలమవుతున్న పరిస్థితికి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,716 ఇళ్లు ప్రస్తుతం నిర్మించి అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా సూర్యాపేట నియోజకవర్గంలో 1,358 ఇళ్లు, నల్లగొండలో 710, మిర్యాలగూడలో 640, కోదాడలో 560, భువనగిరిలో 641, తుంగతుర్తి 211, నకిరేకల్‌లో 534తోపాటు ఆలేరులో ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు మరో 2వేలపైచిలుకు ఇళ్లుఅసంపూర్తిగా ఉన్నాయి. 70శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన 4,716

- మిగతా 7వ పేజీలో...



నల్లగొండలో నిర్మాణం పూర్తయిన ఇళ్లు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రిజర్వేషన్లు, తదితర అంశాలపై చర్చించిన మంత్రివర్గం, ఏ క్షణమైనా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో సత్తా చాటి రానున్న రోజుల్లో మరింత పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



స్థానికంపై బీజేపీ గురి

- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధిష్ఠానం
- పల్లె, పట్టణం బాట పట్టాలని నేతలకు సూచన
- కేంద్ర ప్రభుత్వ పథకాలతో జనంలోకి



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని అధిష్ఠానం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుకోసం తిప్పలు పడుతోంది. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోగా రాష్ట్రంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు అడుగులు వేస్తోంది. పార్టీ బలోపేతం కావాలంటే ప్రధానంగా క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలను తయారు చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీల్లో పాగా వేసేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకత్వం జిల్లా స్థాయి నేతలకు సూచించింది. జిల్లాల వారీగా కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా ఇన్‌చార్జీలను కూడా నియమించింది. ఈ నేతలంతా నిత్యం స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థుల ఎంపికతో పాటు అన్ని వ్యవహారాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే జిల్లా కార్యవర్గాలతో బీజేపీ ఇన్‌చార్జీలు సమావేశాలు నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని పదాధికారులంతా పల్లె, పట్టణం బాటపట్టాలని పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చింది. ఉమ్మడి జిల్లాల్లో రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని బలమున్న చోట పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

కేంద్రం పథకాలతో క్షేత్రస్థాయికి

కేంద్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద నిధులు విడుదల చేస్తోంది. వీటిపై క్షేత్రస్థాయిలో బీజేపీ

- మిగతా 7వ పేజీలో...

నిధులు మంజూరుచేసిన ప్రధానికి కృతజ్ఞతలు



కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద నిధులు విడుదల చేస్తోంది. యాదాద్రి జిల్లాకు కేంద్రప్రభుత్వం ఇటీవల రూ.8.47 కోట్లు విడుదల చేసింది. ఉపాధితో హామీతో పాటు కార్యక్రమాలకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో కేంద్రం అభివృద్ధికి బాటలు వేస్తోంది. నిధులు మంజూరుచేసిన ప్రధానమంత్రికి బీజేపీ, జిల్లా ప్రజల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ నేత, మాజీ ఎంపీ

ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి



నేరేడుగొమ్ము మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. దేవరకొండ మండలం మైనంపల్లి, కొర్రతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి సిమెంట్, ఇటుక, స్టీల్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని కొర్ర మౌనిక అనే లబ్ధిదారును అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణంలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బేస్‌మెంట్ బిల్లు వచ్చిందా అని అడగగా రూ.లక్ష తన అకౌంట్‌లో జమ అయ్యాయని మౌనిక కలెక్టర్‌కు తెలిపారు. ఇంటి నిర్మాణం వేగవంతంగా చేస్తున్నందున రెండో విడత బిల్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గతంలో ఎక్కడ ఉండేవారని కలెక్టర్ వారిని ప్రశ్నించగా గుడిసెలో ఉండేవారమని, గుడిసెను తొలగించి ఇందిరమ్మ ఇల్లును కట్టుకుంటున్నామని బాధితులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ ఉన్నారు.

పౌష్టికాహారం అందుతుందా..

నేరేడుగొమ్ము: మండలంలోని తిమ్మాపురం చెంచుకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడారు. పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. పక్కా భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీడీవో వాణి ఉన్నారు.

త్రిపురారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను అడిషనల్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, సిబ్బంది తదితరులున్నారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్‌కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెల వారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, రేషన్ బియ్యం అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నీ కూలంకుషంగా పరిశోధన చేయాలన్నారు. పోక్సో గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థ సేవలు అందిస్తూ సత్వర న్యాయం చేసేలా కృషిచేయాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ మౌనిక, ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రం ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుంది. బిక్షాటన, ఇతర పద్ధతుల ద్వారా ఉపాధి పొందుతున్న స్వయం ఉపాధితో వారు సమాజంలో గౌరవం పొందేలా కుట్టు శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం 35 మంది శిక్షణ శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ ద్వారా వారిలోని నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్‌లో మంచి స్థితిలో జీవించేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా శిక్షణ అనంతరం ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఆర్థికసాయం కూడా అందించనుంది. దీంతో వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఉపాధి పొందుతూ గౌరవప్రద జీవితాన్ని గడపనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)



సామాజిక గౌరవం దిశగా

సూర్యాపేటలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత కుట్టుశిక్షణ

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎన్నో అసమానతలు ఎదుర్కొంటున్నారు. సరైన జీవనోపాధి లేక ఇబ్బందికర జీవనం సాగిస్తున్నారు. సమాజంలో తమకంటూ ఓ గుర్తింపుకావాలని అందుకు జీవనోపాధి కల్పించాలని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్ర రాజధానిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అందుకు వారికి శిక్షణ సైతం ఇప్పించారు. అయితే ఇటీవల సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ నిర్వహించిన మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమావేశానికి ట్రాన్స్‌జెండర్లను ఆహ్వానించారు. తమకు ఏదైనా ఉపాధి కల్పించాలని, భిక్షాటన, ఇతర పనులు చేయడం ఇబ్బందిగా ఉందని, తమకంటూ సమాజంలో గౌరవం దక్కాలని కలెక్టర్‌కు వివరించారు. తాము కూడా గౌరవప్రదంగా జీవించాలని అందుకు తమకు ఏదైనా చేయాలని కలెక్టర్‌ను కోరారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను విన్న కలెక్టర్ వెంటనే జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు కుట్టు శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన నిధులను డీఎంఎఫ్‌టీ నుంచి మంజూరు చేస్తానని తెలిపారు. దీంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ సమీపంలో మహిళా సాధికారిత ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు కుట్టుశిక్షణలో మెళకువలు నేర్పిస్తున్నారు. ఈశిక్షణ రెండు నెలలపాటు కొనసాగనుంది.

35 మంది హాజరు..

సూర్యాపేటలో ట్రాన్స్‌జెండర్లకు అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు ప్రస్తుతం 35 మంది హాజరవుతున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు

- మిగతా 6వ పేజీలో...

ఏటా విద్యా ఖర్చు..
రూ.150కోట్లు
తల్లిదండ్రుల జేబులు గుల్ల



6

సూర్యాపేటకు చెందిన రూప గృహిణి. ఆమె భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగి. నెల వేతనం రూ.18వేలు. వారికి బాబు, పాప ఉన్నారు. బాబు నాలుగో తరగతి చదువుతున్నాడు. పుస్తకాలకు రూ.5,700కాగా, ఫీజు రూ.40వేలు, యూనిఫాం, ఇతరత్రా కలిపి మరో రూ.20వేలు అవుతున్నాయి. ఆయన జీతం మాత్రం పెరగలేదు గానీ, గతేడాది మూడో తరగతి రూ.30వేలు ఉన్న ఫీజు ఇప్పుడు రూ.10 వేలు పెరిగింది. అప్పు చేయాల్సిన పరిస్థితి. మరో ఏడాదిలో పాపను స్కూల్‌లో చేర్పించాల్సి ఉండటంతో దాన్ని తల్చుకుని భయం వ్యక్తం చేస్తోంది.

-(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)

వల్లభరావు చెరువులో ఆక్రమణలు నిజమే

- నిర్ధారించిన నీటిపారుదలశాఖ అధికారులు
- హద్దులు దాటి నిర్మాణాలు చేపట్టారని స్పష్టీకరణ
- తక్షణ సర్వేకు తహసీల్దార్‌కు లేఖ



వల్లభరావు చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

నల్లగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువు (బతుకమ్మకుంట) లో ఆక్రమణలు జరిగినట్లు నీటిపారుదలశాఖ అధికారులు నిర్ధారించారు. వల్లభరావు చెరువు ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 16న 'వల్లభరావు చెరువులో ఆక్రమణలే లేవట?' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించి శిఖం భూములను పరిశీలించాల్సిందిగా నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో నీటిపారుదలశాఖ డీఈఈ సతీష్ చంద్రతో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దివ్య, మేఘన మంగళవారం సాయంత్రం వల్లభరావు చెరువు శిఖం భూములను పరిశీలించారు. చెరువు శిఖం ఆక్రమణకు గురైందని అధికారులు గుర్తించారు.

ఇదిలా ఉండగా ఆక్రమణదారులు గతంలో ఉన్న హద్దులు దాటి ప్రహరీ, గేటు నిర్మాణాలను చేశారు. చెరువు శిఖం భూములకు సంబంధించి గతంలో దిమ్మెలతో కూడిన హద్దులు ఉండేవి. ఆ దిమ్మెలను కూలగొట్టి ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఓ హద్దురాయి మాత్రం ఆక్రమణదారుల కళ్లలో పడిందో లేదో గానీ వదిలేయడంతో దాని ఆధారంగా అధికారులు చెరువు శిఖం ఆక్రమణకుగురైనట్లు నిర్ధారణకు వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు భూమిని ఆక్రమించిన వారిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది ఆక్రమణదారులు కేసు కాకుండా చూసుకున్నారు. తిరిగి మళ్లీ ఆక్రమించి ప్రహరీ నిర్మించి హద్దులు కనపడకుండా చేసి కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేసే యత్నంలో ఉన్నారు.

తప్పుదోవ పట్టించిన రెవెన్యూశాఖ

వల్లభరావు చెరువు ఆక్రమణకు గురైనా రెవెన్యూ శాఖ మాత్రం తప్పుదోవ పట్టించేలా వ్యవహరించింది. సర్వే చేయకుండానే చేసినట్లు రికార్డు తయారు చేయడంతో పాటు కాగితాలకే పరిమితం చేసి ఫీల్డ్ సర్వేను చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 86 ఎకరాల చెరువు శిఖం భూమిని 20 నిమిషాల్లో ఎలా సర్వే చేస్తారని పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు నీటిపారుదలశాఖకు ఎలాంటి ఆక్రమణలు జరగలేదని చెప్పడంతోపాటు ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు సైతం తప్పుడు నివేదిక అందించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. సర్వే చేపట్టే బాధ్యత రెవెన్యూశాఖకు ఉండటంతో ఆక్రమణదారులతో కుమ్మక్కయినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా, చెరువు ఆక్రమణకుగురైనట్లు నీటిపారుదల శాఖ గుర్తించి దీనిపై తహసీల్దార్ హరిబాబుకు లేఖ రాయాలని నిర్ణయించారు.

ఇదిలా ఉండగా, తప్పుడు సర్వే నిర్వహించిన సర్వేయర్‌ను తొలగించి సీనియర్ సర్వేయర్‌ను, ఇతర మండలాల సర్వేయర్‌తో సర్వే చేయాలని స్థానికులు కోరుతున్నారు. తహసీల్దార్ హరిబాబు వల్లభరావు చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్వయంగా చెప్పగా, నీటిపారుదల శాఖ అధికారులు చెరువు ఆక్రమణకు గురైనట్లు ధ్రువీకరించినందున తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై నీటిపారుదలశాఖ అధికారులను వివరణ కోరగా, ఆక్రమణలకు పాల్పడిన వారిపై వారం రోజుల్లోపు చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలు కూల్చివేస్తామని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు
అమలు చేయాలి



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురజ రామచంద్రం

మునుగోడు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు. మండలంలోని కొంపెల్లి గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు వేదికల్లో నడుపుతున్న ఈ కార్యక్రమం ఒక్కరోజు అవగాహనతో సరిపెట్టకుండా వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు సలహాలు సూచనలు ఇస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బొమ్మరగోని లాలు, సుర్గి చలపతి, ఈదుల కంటి కైలాస్, బండారు శంకర్, దశరథ, వి. వెంకటేశ్వరరావు, యాదయ్య, పులకరం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక బోధనా పద్ధతులు అవలంబించాలి

డీఈవో బొల్లారం భిక్షపతి

దామరచర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆధునిక బోధనా పద్ధతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకర్షించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ జడ్పీహైస్కూల్, ఇంద్రానగర్ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, దామరచర్ల జడ్పీ హైస్కూల్ ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులను అభ్యసన వాతావరణంవైపు మళ్లించేందుకు భాషా కృత్యాలు, గణిత కృత్యాలతో పాటు కథలు చెప్పించడం, డిజిటల్ తరగతులు నిర్వహించడం వంటివి చేయించి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షించాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలను తరగతి గదిలో అమలుచేయకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఇంకా యూనిఫాం అందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థికి పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం వెంటనే పంపిణీచేయాలన్నారు. భవిత కేంద్రం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీనాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కేతావత్ సైదానాయక్, బండా వెంకటరెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, వీరయ్య, రవి, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం రేపు

హాలియా,జూన్17(ఆంధ్రజ్యోతి): హాలియా ఎక్సైజ్‌శాఖ పరిధి లో చేసిన మూడు, ద్విచక్ర వాహనాలకు 19వ తేదీన వేలం వేయనున్నట్లు హాలియా ఎక్సైజ్ సీఐ కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నల్ల గొండ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో రూ.5 వేల డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో వాహనం పొందలేని వారికి డిపాజిట్ తిరిగి చెల్లించనున్నట్లు వివరించారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

చింతపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ దేన్యాతండా గ్రామ అధ్యక్షుడు రమావత్ శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో లబ్ధిదా రులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమావత్ హనుమానాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ నిర్మించరూ..!



నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు.

- నార్కట్‌పల్లి- అద్దంకి రోడ్డు వెంట డ్రైనేజీ నిర్మించని కాంట్రాక్టర్
- వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం లో దుర్వాసనతో గ్రామస్థుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట సర్వీస్ రోడ్డుతోపాటు డ్రైనేజీని నిర్మించకపోవడం ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైనా డ్రైనేజీ లేక పలు వీధుల్లోని నీరు రహదారి వెంట ఇళ్ల ఎదుట పారుతుండడంతో పాటు రోడ్డుపైకి చేరుతుండడంతో గ్రామస్థులు, ఇటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని బుగ్గబావి గూడెం గ్రామంలో సర్వీస్ రోడ్డుతోపాటు డ్రైనేజీని ఏర్పాటు చేయాల్సినప్పటికీ దశాబ్దన్నర కాలంగా కాంట్రాక్ట్ సంస్థ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల ముందు నిత్యం డ్రైనేజీ నీరు పిల్లకాల్వలా పారుతుండడంతో నిల్వ ఉండడంతో దుర్వాసనతో సమీప ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది.ఈ విషయమై పలుమార్లు సంబంధిత రోడ్డు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం బాధాకరం. సదరు కాంట్రాక్ట్ సంస్థ రహదారిపై టోల్‌పీజు వసూలు చేస్తున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం తమ గ్రామానికి కల్పించకపోవడం పట్ల అంతర్యమేంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి సకాలంలో సర్వీస్ రోడ్డుతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేసి తమ ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నారు.

రహదారి వెంట డ్రైనేజీని ఏర్పాటు చేయాలి

నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా తమ ఇండ్ల ముందు డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. దీంతో ఇళ్ల ముందు మురుగునీరు చేరడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వెళ్లాల్సి వస్తే రోడ్డు మీదుగా వెళ్లాల్సి రావడంతో ఎక్కడ ప్రమాదం చోటు చేసుకొని ప్రాణాలు పోతాయోమనని భయాందోళనకు గురవుతున్నాం. తక్షణమే డ్రైనేజీ ఏర్పాటు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి



- రొండి శ్రీనివాస్ (బుగ్గబావిగూడెం)

జోరుగా సాగు పనులు

వర్షాలు కురుస్తుండడంతో దేవరకొండ డివిజన్‌లో ఊపందుకున్న వ్యవసాయ పనులు




కొత్తపల్లిలో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు, కూలీలు

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ): దేవరకొండ డివిజన్‌లో వర్షాలు కురుస్తుండడంతో పత్తి విత్తనాలు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మృగశిరకార్తె కంటే ముందే వర్షం కురవడంతో దుక్కులు దున్నుకొని విత్తనాలు వేసేందుకు రైతులు సన్నధమయ్యారు. వారం రోజులుగా వర్షాలు కురవడం తో పత్తి విత్తనాలు వేసుకుంటున్నారు. దేవరకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, చింతపల్లి, పీఏపల్లి, కొండమల్లేపల్లి, గుడిపల్లి మండలాలలో 2.25 లక్షల ఎకరాల్లో వ్యవసాయం సాగుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది 1.74 లక్ష ఎకరాల్లో పత్తి, 35 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది దేవరకొండ డివిజన్‌లో 1.80 లక్షల ఎకరాల వరకు రైతులు పత్తి సాగు చేశారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, నువ్వులు, ఇతర వాణిజ్యపంటలు వేసుకోవాలని సూచించారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలి. నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశాం. రైతులు దళారీల మాటలు నమ్మవద్దు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని పంటలను సాగుచేసుకొని అధిక దిగుబడి సాధించాలి.

- శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ



ఇంజన్‌బావిని ఆక్రమిస్తే కేసులు పెడతాం

డిండి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇంజన్‌బావిని ఆక్రమిస్తే కేసులు పెడతామని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. బావిచుట్టు ఆక్రమణలకు గురవుతుందని ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఆయన పరిశీలించారు. బావిచుట్టు హద్దులు నిర్ణయించాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వర్షపు, మురుగునీరు దిగువకు వెళ్లకుండా అడ్డుగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో నోటీసులు ఇవ్వకుండా తొలగించాలని ఆదేశించారు. ఇంజన్‌బావి చుట్టు తాత్కాలికంగా డబ్బా వేసుకొని జీవనోపాధి పొందుతున్న వారి నుంచి ఒప్పంద పత్రాలు రాయించుకోవాలని సూచించారు. గ్రామసభలు, ఇంజన్‌బావిలో భవిష్యత్‌లో శాంపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జంగయ్య, వాటర్‌మెన్ గంగాధర్, వ్యాపారులు ఉన్నారు.

మూసివేసిన పాఠశాలలు ప్రారంభించాలి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేని కారణంగా మూసివేసిన పాఠశాలలను తిరిగి పున ప్రారంభించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎంఈవో ఆన్.అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సొనగంటి వేణుగోపాల్ మాట్లాడుతూ... మండలంలోని ఎర్రమటి తండా, రాయినిగూడెం, బద్దవారిగూడెం, అనాజీపురం, నసర్లపల్లి ఉర్దూమీడియం, దేవులతండాల్లో ప్రాథమిక పాఠశాలలు మూసివేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే విద్యార్థులు తిరిగి పాఠశాలలకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎంఈవోకు దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి శివకోటి కిరణ్‌కుమార్, కొర్రా జగ్‌రాంనాయక్ పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన చెరువు భూముల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు


కొండమల్లేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన చెరువు, కుంట, శిఖం భూముల గుర్తింపులో భాగంగా మండలంలో మంగళవారం తహసీల్దార్ నరేందర్, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. కొండమల్లేపల్లి సర్వే నంబర్ .118లోని నల్లకుంట, సర్వే నంబర్.174లోని పచ్చర్లబావి కుంట, సర్వే నెం.45లోని దోనియాల పెద్ద చెరువు కుంటలకు చెందిన భూములకు సంబంధించి అధికారులు సర్వే చేశారు.. ఈ మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఇరిగేషన్ అధికారులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సరిత, జ్యోతి, జెల్‌సింగ్, ఆర్‌ఐ శ్రీనివాస్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి మాజీ ఎంపీటీసీ పెద్దమ్మ మృతి



దేవరకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మాజీ సర్పంచ్ హనుమంతు చంద్రన్న సతీమణి , మైనంపల్లి మాజీ ఎంపీటీసీ పెద్దమ్మ(82) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెం దారు. ఆమె మృతికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. విష యం తెలియగానే చంద్ర న్న అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, చంద్రన్న ఫౌండేషన్ సభ్యులు ఆయన ఇంటికి చేరుకొని పెద్దమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దమ్మ మృతికి మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సిహ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, జాన్ యాదవ్, వివిధ పార్టీల నాయకులు పెద్ద మ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా చంద్రన్నను మావోయిస్టులు గతంలో హత్య చేశారు.

వ్యక్తి అదృశ్యం



కాశయ్య (ఫైల్)

తిరుమలగిరి(సాగర్), జూన్ 17(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నెల్లికల్లు గ్రామానికి చెందిన బైరు కాశయ్య కొద్ది రోజులుగా కనిపించడం లేదు. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నెల్లికల్లు గ్రామానికి చెందిన బైరు కాశయ్య గత నెల 21న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య గీత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులను బిడ్డల్లా సంరక్షించాలి



ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను కలిసిన వసతిగృహ సంక్షేమ అధికారులు

మిర్యాలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులను కన్న బిడ్డల్లా సంరక్షించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలో నియమితులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ డిపార్ట్‌మెంట్ వసతి గృహ సంక్షేమ అధికారులు రాష్ట్ర వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం కోశాధికారి బైరబోయిన లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏబీసీడబ్ల్యూఓ కొణతం చంద్రారెడ్డి, వసతిగృహ సంక్షేమ అధికారులు టి.వెంకటేశ్వర్లు, నుస్రత్ అలీ, లక్ష్మయ్య, జానిమియా, పార్వతి, సీతాసావిత్రి, కవిత, సోమరాజు, తోట నరేష్, మంగమ్మ, సంధ్యారాణి, సతీష్, బి.రామకృష్ణ, తరుణ్, రాకేష్, హరీష్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హాలియా,జూన్17(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలో అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, కోరే రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈవో గుండా కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అనుమతి లేని పాఠశాలలను ప్రారంభించి విద్యార్థుల తల్లిద ండ్రుల దగ్గర నుంచి వేలాది రూపాయలు పీజుల వసూలు చేస్తూ తలిదండ్రుల రక్తాన్ని తాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఇష్టానుసారంగా ఆకర్షణీయమనైన పదాల పేర్లతో వేలాది రూపాయలతో పుస్తకాలను అంగట్లో సరుకుల లెక్క అమ్ముతున్నారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో వర్షిత్, నాగరాజు, కార్తీక్, పవన్, శశి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలి

తిరుమలగిరి(సాగర్) : ప్రైవేట్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్న అధిక పీజులు, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మండల కేంద్రంలో ఎంఈవోను కలిసి వినతిపత్రం అందజేరు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో వర్షిత్, మహేష్, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

రుణాలను వందశాతం రికవరీ చేయాలి : డీఆర్‌డీవో



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

దామరచర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను వంద శాతం రికవరి చేయాలని డీఆర్‌డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సంఘం పదాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల తరుపున ఎంపికైన ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లోని మహిళలను చైతన్య పరుస్తూ ప్రతి నిరుపేద మహిళ సంఘంలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్ద పీట వేస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను వందశాతం రికవరీ చేయాలన్నారు. దామరచర్ల మండల బ్యాంక్ రుణాలు మహిళా సంఘాలకు 2025-26 ఆర్థికసంవత్సరానికి రూ.36.86కోట్లను మహిళా సంఘాలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గుంటి దిలీప్‌కుమార్, సీసీలు పల్లా శ్రీను, ఎల్.శంకర్, కవిత, ఎస్‌ఆర్పీలు తిరుమల, సుమతి, గ్రామ సంఘాల కార్యదర్శులు, పాల్గొన్నారు.

వంతెనను వినియోగంలోకి తేవాలి : సీపీఎం



వంతెన పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సీతారాంపురం-బంగారుగడ్డ మధ్య నిర్మించిన వంతెనన వినియోగంలోకి తేవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులడు డబ్బికార్ మల్లేష్ కోరారు. సీపీఎం బృం దం మంగళవారం పట్టణంలోని సీతారాంపురంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాంపురం-బంగారుగడ్డ మధ్య డ్రైనేజీపై రూ20 లక్షలతో నిర్మించిన వంతెనను వినియోగంలోకి తీసుకరాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిని రోడ్డు కంటే ఎత్తులో నిర్మించడం, వంతెనపై రాకపోకలకు అనుసంధానంగా అప్రోచ్‌రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో వంతెనపై వాహనాలు ప్రయాణించే వీలు లేకుండా పోంయిందన్నారు అధికారులు వంతెనను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, టౌటౌన్ కార్యదర్శి భవాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు ఆయూబ్, తిరుపతి రాంమూర్తి, వాడపల్లి రమేశ్, గునగంటి రామచంద్రు, భాస్కర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన



కొండమల్లేపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో ఖతిజా

వేములపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆట పాటలతో విద్యాబోధన చేపట్టి చిన్నారులను పాఠశాలకు సంసిద్ధులను చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతాయని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అన్నారు. మండలంలోని రావులపెంటలో మంగళవారం చిన్నారులకు నిర్వహించిన సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఓరుగంటి రమేష్ చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, అంగన్‌వాడి టీచర్లు శారదా, వెంకటరమణ, విజయ, ఏఎన్‌ఎం నిర్మల పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : మండలంలోని గుమ్మడవెల్లి అంగన్‌వాడి కేంద్రం లో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఖతిజా మాట్లాడుతూ మూ డేళ్ల నిండిన పిల్లలను ప్రీ ప్రైమరీ స్కూల్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ అరుంధతి పాల్గొన్నారు.

● చింతపల్లి : కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట-పాటలతో పాటు బొమ్మలతో బోధన చెప్పాలని సీడీపీవో సక్కుబాయి తెలిపారు. మంగళవారంచింతపల్లి, ఘడియాగౌరారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, అంజమ్మ, టీచర్లు పద్మావతి, జయమ్మ, వనం పద్మావతి, లక్ష్మి, వెంకటమ్మ, వీణ, పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి, : మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలలోపు గల చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని సూపర్‌వైజర్ సీహెచ్.నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్సాయిపాలెం అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు శోభా, రమాదేవి, మణెమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళ దీక్ష విరమణ

త్రిపురారం, జూన్17(ఆంధ్రజ్యోతి): కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన మాతంగి సైదమ భర్త వదిలి వెళ్లడంతో తన తల్లి వద్ద ఉంటుంది. తనకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని ఈ నెల 16న స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట నిరహర దీక్ష చేపట్టింది..ఆమెకు ఇంటి స్థలం లేకపోవడంతో ఎల్-2 లిస్టులో చేర్చామని ఎంపీడీవో తెలిపింది.. అయితే కోమటిగూడెంలోని ప్రభుత్వ స్థలంతో గుంట స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను కోరింది. అభ్యర్థనను పరిశీలిస్తామని వారు తెలిపారు.. సైదమ్మ సాయంత్రం వరకు దీక్ష కొనసాగిస్తుండగా ఆర్ఐ, పోలీసులు కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తామని నచ్చ చెప్పడంతో ఆమె దీక్ష విరమించింది.

ఆర్థిక సాయం

వేములపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం ఆర్ట్ టీచర్ బొస్క సైదులు కుటుంబ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు రూ.20 వేలు మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోని వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రభాకర్, ఉపేందర్, సుధాకర్, కృష్ణయ్య, వాణిశ్రీ, నాగశ్రీ, యాదమ్మ, శాంతాకుమారి, నాగమణి, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమాదేవి, ఎల్లయ్య, లలిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ



రక్షణ గొడుగులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని వాసవీ క్లబ్ ఐఈసీ ఆఫీసర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ అన్నారు. వాసవీ క్లబ్ ఆఫ్ బాహుబలి ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చెప్పులు కుట్టే వారికి రక్షణ గొడుగులు, ఆశ్రమాలకు వాటర్ ట్యాంకులు, అంగవైకల్యాన్ని గుర్తించే కిట్లను పంపిణీ చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి గరుకు స్తంభం అందజేసిన అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో లకుమారపు మల్లయ్య, వెచ్చ సతీష్, గట్టు రమేష్, గుమ్మడవెల్లి ప్రభాకర్, జవహర్‌బాబు, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ యంత్రాంగానికి కళ్లు తెరిపించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ ప్రభుత్వానికి, అధికారులకు కనిపించకపోవడం సిగ్గు చేటన్నారు. విద్యాశాఖాధికారులు ప్రైవేటు సేవలో ఉండి ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రధానంగా పాఠశాలల్లో జరిగే విద్యా వ్యాపారాన్ని అదుపు చేయాలని, లేని పక్షంఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అజయ్, ఇంద్ర, గంగాధర్, ఉపేందర్, శంకర్, రమేష్, సైదులు, శ్రీను పాల్గొన్నారు.